# నీళ్లపై రేవంత్ నీచరాజకీయాలు

- కేసీఆర్ ప్రారంభించిన పథకాలను కొనసాగించాలి
- మేడిగడ్డ బరాజ్‌ను తక్షణం పునరుద్ధరించాలి
- గోదావరి- బనకచర్ల లింక్ ప్రాజెక్టును అడ్డుకోవాలి
- కృష్ణా జలాల్లో న్యాయమైన వాటాను సాధించాలి: ఎమ్మెల్సీ కవిత, నీటిరంగ నిపుణులు
- రౌండ్‌టేబుల్'లో తీర్మానం



శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో 'నీళ్లు- నిజాలు'పై నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత, చిత్రంలో వీ ప్రకాశ్, దేవీప్రసాద్, శ్రీధర్‌రావు దేశ్‌పాండే, టంకశాల అశోక్, పల్లె రవి, నవీన్ తదితరులు

హైదరాబాద్, జనవరి 31 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నీళ్లపై నీచ రాజకీయాలను మానుకోవాలని, ఇకనైనా ప్రజలకు వాస్తవాలు చెప్పాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. జాగృతి సంస్థ ఆధ్వర్యంలో 'నీళ్లు-నిజాలు' అనే అంశంపై శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి కవిత అధ్యక్షత వహించగా, విశ్రాంత ఇంజినీర్లు, నీటిరంగ నిపుణులు, వివిధ జిల్లాలకు చెందిన ప్రజాసంఘాల నేతలు పాల్గొన్నారు. పలు తీర్మానాలు ఆమోదించి సీఎం రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం నీళ్లపై రాజకీయాలను మానుకోవాలని అన్నారు. కేసీఆర్‌పై అక్కసుతో కాళేశ్వరం ప్రాజెక్టుపై దుష్ప్రచారం చేయడమే కాకుండా, రైతులకు నీళ్లు ఇవ్వకుండా పొలాలను ఎండబెడుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ బురద రాజకీయాన్ని, గోదావరి వరదను కూడా తట్టుకొని మేడిగడ్డ బరాజ్ మేరునగధీరుడిలా నిలబడిందని వివరించారు. కేసీఆర్ పూర్తి చేసిన ప్రధాన ప్రాజెక్టుల్లో మిగిలి ఉన్న చిన్నచిన్న పనులను పూర్తి చేయాలని డిమాండ్‌చేశారు. వైఎస్సార్ ప్రారంభించిన ఆరోగ్యశ్రీని కేసీఆర్, కాంగ్రెస్ ప్రారంభించిన ఉపాధి హామీ పథకాన్ని బీజేపీ కొనసాగించారని, అదే తరహాలో కేసీఆర్ ప్రారంభించిన పనులను సీఎం రేవంత్‌రెడ్డి కొనసాగించాలని హితవు చెప్పారు. ఆంధ్ర క్యాడర్‌లో పనిచేసిన ఆదిత్యనాథ్‌దాస్‌ను ఇరిగేషన్ సలహాదారుగా వెంటనే తొలగించాలని, కృష్ణ ట్రిబ్యునల్‌లో రాష్ట్రం తరపున బలంగా వాదనలు వినిపించాలని సూచించారు. ఉమ్మడి రాష్ట్రంలో 60 ఏళ్లలో కేవలం 50 లక్షల ఎకరాలకు నీళ్లందించారని, కానీ తెలంగాణ ఏర్పడిన తర్వాత పదేండ్లలో కోటి ఎకరాలకుపైగా నీళ్లందించామని, కాలంతో పోటీ పడి ప్రపంచంలోనే అత్యద్భుతమైన కాళేశ్వరం ప్రాజెక్టును కేసీఆర్ నిర్మించారని వివరించారు. మిషన్‌కాకతీయ ద్వారా చెరువులను బాగు చేసుకొని 15 లక్షల ఎకరాలకు సాగునీళ్లను అందించారని, కేవలం చెరువులను బాగు చేసుకోవడం వల్ల 9.6 టీఎంసీల నీటిని ఒడిసి పట్టుకున్నామని తెలిపారు. ఇన్ని చేసినా పదేండ్లలో ఏమీ జరగలేదని కాంగ్రెస్ నాయకులు ఆరోపణలు చేయడం బాధాకరమని ఆవేదన వ్యక్తంచేశారు.

### తెలంగాణ సోయితో పాలన కొనసాగాలి..

**కాంగ్రెస్** నాయకులు పదవుల కోసం పైరవీలు చేసుకున్నారు తప్ప ప్రాజెక్టుల కోసం కొట్లాడలేదని కవిత నిప్పులు చెరిగారు. గట్టిగా జై తెలంగాణ అంటే.. వెంటనే ఫేక్ ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేసేవారని గుర్తుచేశారు. 'వైఎస్‌ఆర్ పోతిరెడ్డిపాడు ప్రాజెక్టు ద్వారా రాయలసీమ ప్రాంతానికి మన జలాలను తరలించారు. అదే ఒరవడిని జగన్, చంద్రబాబు కొనసాగించారు. అందులో భాగంగానే ఏపీ ప్రభుత్వం రాయలసీమ ఎత్తిపోతల, పోలవరం–బనకచర్ల ప్రాజెక్టులను చేపడుతున్నాయి. ఇన్నాళ్లు కాంగ్రెస్, టీడీపీలే అన్యాయం చేశాయనుకుంటే... ఇప్పుడు వాటికి బీజేపీ తోడయ్యింది' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. జలవనరుల విషయాల్లో ఇతర రాష్ట్రాల్లో పార్టీలకు అతీతంగా ఒక్కటవుతారని, కానీ తెలంగాణలో మాత్రం కాంగ్రెస్, బీజేపీలు రాజకీయం చేస్తున్నాయని విమర్శించారు. ముఖ్యమంత్రి సొంత జిల్లా, ఇరిగేషన్ శాఖ మంత్రి సొంత జిల్లాలో పంటను ఎండగొట్టారని ఉదాహరించారు. బీఆర్‌ఎస్ హయాంలోనే సీతారామ ఎత్తిపోతల పథకం పనులు దాదాపు పూర్తయ్యాయని, కాంగ్రెస్ ప్రభుత్వం దాన్ని ఆర్భాటంగా ప్రారంభించినా ఆ ప్రాజెక్టు ద్వారా చుక్క నీరు కూడా ఇవ్వలేదని వెల్లడించారు. ఇకనైనా తెలంగాణ సోయితో ప్రభుత్వం పరిపాలనను కొనసాగించాలని హితవుపలికారు.

### ఓర్వలేకనే విషప్రచారం: వీ ప్రకాశ్

తెలంగాణ ఉద్యమాన్ని కేసీఆర్ మొదలుపెట్టేవరకూ ప్రాణహిత, పెన్‌గంగా ప్రాజెక్టులకు అతీగతీ లేకుండా పోయిందని తెలంగాణ జలవనరుల అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ వీ ప్రకాశ్ అన్నారు. ఇచ్చంపల్లి ప్రాజెక్టు వల్ల తెలంగాణకు కలిగే లాభంకన్నా ఛత్తీస్‌గఢ్, ఆంధ్రాకే లాభం ఎక్కువని, కేసీఆర్ దానిని పక్కనబెట్టి మేడిగడ్డ వద్ద ప్రాజెక్టు కట్టారని గుర్తుచేశారు. యుద్ధప్రాతిపదికన పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులను పూర్తిచేశారని వివరించారు. పదేళ్ల కాలంలో తెలంగాణ సాగునీటి రంగాన్ని ప్రపంచంలోనే మేటిగా నిలపాలని సంకల్పించారని, కోటి ఎకరాల మాగాణం తన స్వప్నమని చెప్పి సాధించి చూపించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని కొనియాడారు. ఓర్వలేనితనంతో కాంగ్రెస్ ప్రభుత్వం మేడిగడ్డ ప్రాజెక్టుపై దుమ్మెత్తిపోస్తున్నదని మండిపడ్డారు. నీళ్లు, ప్రాజెక్టులపై చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు రాష్ట్రవ్యాప్తంగా సమావేశాలను నిర్వహించాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

### కేసీఆర్‌తోనే జలఫలాలు: శ్రీధర్‌రావు

కేసీఆర్‌తోనే తెలంగాణ రైతాంగానికి నదీ జలాల ఫలాలు దక్కాయని విశ్రాంత ఇంజినీర్, మాజీ ఓఎస్డీ శ్రీధర్‌రావు దేశ్‌పాండే కొనియాడారు. కేసీఆర్ చేపట్టిన ప్రాజెక్టుల వల్ల పంటల ఉత్పత్తి, మత్స్యసంపద, పశుసంపద గణనీయంగా పెరిగాయని గణాంకాలతోసహా ఉదహరించారు. జలవనరుల విషయంలో కేసీఆర్ బహులాంచల వ్యూహాన్ని అవలంబించారని కొనియాడారు. తుమ్మిడిహట్టి వద్ద 165 టీఎంసీల లభ్యత ఉన్నా, అందులో ఎగువ రాష్ట్రాల వాటా 63 టీఎంసీలని, అవిపోతే అందుబాటులో ఉండేది 102 టీఎంసీ లేనని, ఇది సీడబ్ల్యూసీ చెప్పిందేనని, కానీ కాంగ్రెస్ ఆ సత్యాన్ని దాచి అబద్ధాలు ప్రచారం చేస్తున్నదని విమర్శించారు. ఇంజినీర్ల ప్రతిపాదనలతో మేడిగడ్డను ఎంపిక చేశారని, బరాజ్ నిర్మాణంలో నాణ్యతా లోపాలు లేవని తెలిపారు. ఎక్కడయినా బరాజ్‌లను ఇసుకపైనే నిర్మిస్తారని తెలిపారు. అదేవిధంగా బరాజ్‌లో భారీ స్టోరేజీ పెట్టారంటూ అసంబద్ధ వాదనలు చేస్తున్నారని ఖండించారు. దేశంలో అత్యధిక నీటినిల్వ సామర్థ్యంతో నిర్మించిన ఫరక్కా, గంగా, తెహ్రీ బరాజ్‌లు ఉన్నాయని, వాటితో పోల్చితే మేడిగడ్డ స్వల్పమేనని వివరించారు.

### రౌండ్‌టేబుల్ సమావేశం తీర్మానాలు

- మేడిగడ్డ బరాజ్‌ను పునరుద్ధరించి కాళేశ్వరం ప్రాజెక్టు లింక్ –1ను వినియోగంలోకి తీసుకురావాలి.
- ఇరిగేషన్ అడ్వైజర్ పోస్ట్ నుంచి ఆదిత్యనాథ్ దాస్‌ను తక్షణం తొలగించాలి.
- ఏపీ అక్రమంగా నిర్మిస్తోన్న గోదావరి బనకచర్ల లింక్ ప్రాజెక్టుపై అపెక్స్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయాలని కోరుతూ కేంద్రానికి లేఖ రాయాలి.
- తెలంగాణకు 575 టీఎంసీల నికరజలాలను సాధించేందుకు కృష్ణా ట్రిబ్యునల్‌లో వాదనలు వినిపించాలి.
- గోదావరి – మూసీ ప్రాజెక్టును మల్లన్నసాగర్ నుంచి కాకుండా తక్కువ ఖర్చుతో పూర్తయ్యే కొండపోచమ్మ సాగర్ నుంచి చేపట్టాలి.
- ఇరిగేషన్ ప్రాజెక్టులన్నీ పూర్తి చేయడానికి ఏటా రూ.20 వేల కోట్లకు తగ్గకుండా బడ్జెట్ కేటాయించాలి.
- నాగార్జునసాగర్ ప్రాజెక్టును పూర్తిగా తెలంగాణ ప్రభుత్వ అధీనంలోకి తేవాలి
- జూరాల ప్రాజెక్టుకు వచ్చే వరదను సమర్థంగా వినిగించుకునేలా మరో ఎత్తిపోతల పథకం చేపట్టాలి.
- వార్ధ, పాలమూరు–రంగారెడ్డి, సీతమ్మ సాగర్, డిండి, ఎస్‌ఎల్‌బీసీ ప్రాజెక్టులను సత్వరమే పూర్తిచేసి సాగునీరివ్వాలి.
- రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని ఆపేలా కేంద్రంపై ఒత్తిడి తేవాలి.
- కేంద్రం వద్ద పెండింగ్ ప్రాజెక్టుల డీపీఆర్‌లకు అనుమతులు సాధించాలి.

### మేడిగడ్డను వాడుకోవచ్చు..

మేడిగడ్డ బరాజ్‌ను ఇప్పటికిప్పుడు కూడా వాడుకోవచ్చని విశ్రాంత ఇంజినీర్ దామోదర్ రెడ్డి అభిప్రాయపడ్డారు. మేడిగడ్డ బరాజ్‌ను విశ్రాంత ఇంజినీర్లు వ్యతిరేకించారని చేస్తున్న ప్రచారం అసత్యమని ఖండించారు. తాము మేడిగడ్డ నుంచి మిడ్‌మానేరుకు జలాలను తరలించే అలైన్‌మెంట్‌ను మాత్రమే వ్యతిరేకించామని తెలిపారు. తమ అభిప్రాయాన్ని నాటి సీఎం కేసీఆర్ గౌరవించారని, ఫలితంగానే నదీమార్గంలో జలాలను తరలించేలా ప్రణాళికలకు రూపకల్పన చేశారని తెలిపారు. విశ్రాంత ఇంజినీర్ తన్నీరు వెంకటేశం కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. రౌండ్‌టేబుల్ సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకుడు పల్లె రవికుమార్‌గౌడ్, విశ్రాంత సీఈ ఖగేందర్, తెలంగాణ రిటైర్డ్ ఇంజనీర్స్ ఫోరం మాజీ అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, తెలంగాణ జాగృతి ప్రధాన కార్యదర్శి నవీన్‌ఆచారి, తెలంగాణ ఇంజినీర్స్ జేఏసీ కార్యదర్శి వెంకటేశం, అంతర్రాష్ట్ర వ్యవహారాల మాజీ ప్రభుత్వ సలహాదారు టంకశాల అశోక్, ఫ్లోరోసిస్ విమోచన సమితి నాయకులు కంచుకట్ల శ్రీనివాస్, తెలంగాణ గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ అయాచితం శ్రీధర్, టీఎస్పీఎస్సీ మాజీ సభ్యురాలు సుమిత్రానంద్, మాజీ కార్పొరేషన్ చైర్మన్ దేవీప్రసాద్, సీనియర్ జర్నలిస్టు కామెర నవీన్‌కుమార్, బీసీ సంఘం నాయకుడు బొళ్ల శివశంకర్, ఏల్చల దత్తాత్రేయ పాల్గొన్నారు.

## ఇందూరులో బోర్డు.. ఢిల్లీలో బాధ్యతలా?

### పసుపుబోర్డు ఏర్పాటులో కొరవడిన స్పష్టత

### అంతా ఆగమాగం.. అయోమయంలో రైతాంగం



ఢిల్లీలో ఎంపీ అర్వింద్ సమక్షంలో బాధ్యతలు స్వీకరిస్తున్న గంగారెడ్డి

నిజామాబాద్, జనవరి 31 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : పసుపుబోర్డు అంశంలో కేంద్ర ప్రభుత్వం దోబూచులాడుతున్నది. ఐదున్నరేండ్లపాటు సాగదీతతో పసుపు రైతులను మోసం చేసిన బీజేపీ.. 15 రోజుల క్రితం పసుపుబోర్డు ఏర్పాటుపై కీలక ప్రకటన చేసింది. జనవరి 13న జాతీయ పసుపు బోర్డు చైర్మన్‌గా పల్లె గంగారెడ్డిని నియమిస్తూ వాణిజ్య మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. పసుపు పంటకు ప్రత్యేక స్పైసెస్ బోర్డు ప్రకటించింది. జనవరి 14న నిజామాబాద్‌లోని ఓ ప్రైవేటు హోటల్‌లో జాతీయ పసుపు బోర్డు ప్రారంభోత్సవం పేరిట ఎంపీ ధర్మపురి అర్వింద్ హడావుడి చేశారు. పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి సైతం అంతా అయిపోయిందన్న రేంజ్‌లో ప్రకటనలు ఇచ్చారు. ఇప్పుడు జాతీయ పసుపు బోర్డు కార్యాలయాన్ని ఢిల్లీలో ఏర్పాటుచేయడం అనుమానాలకు తావిస్తున్నది. అదే ఆఫీస్‌లో శుక్రవారం ఎంపీ అర్వింద్ సమక్షంలో పల్లె గంగారెడ్డి బాధ్యతలు స్వీకరించడం పసుపు రైతాంగాన్ని అయోమయానికి గురిచేస్తున్నది.

### గుంట భూమి కేటాయించలే..

రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదించకుండా స్థానిక ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలను ఆహ్వానించకుండానే బోర్డు ప్రారంభోత్సవాన్ని నిర్వహించారు. ఢిల్లీ నుంచి వాణిజ్య మంత్రి పీయూశ్‌గోయల్, ఎంపీ అర్వింద్ వర్చువల్‌గా ప్రారంభించారు. నిజామాబాద్‌లోనే పసుపు బోర్డు ఏర్పాటైందని మంత్రితోపాటు ఎంపీ ప్రకటించారు. జాతీయ పసుపు బోర్డుకు ఎక్కడా గుంట భూమి కేటాయించలేదు. ఇదివరకే ఏర్పాటైన స్పైసెస్ బోర్డు ఎక్స్‌టెన్షన్ కార్యాలయం బోర్డునే జాతీయ పసుపు బోర్డుగా మార్చేశారు. రెండు టేబుళ్లు, కుర్చీలతో కార్యాలయాన్ని కొనసాగిస్తున్నారు. సాంకేతికంగా జాతీయ పసుపు బోర్డు నిజామాబాద్‌లోనే ఏర్పాటు చేస్తే చైర్మన్ కూడా అక్కడి కార్యాలయంలోనే బాధ్యతలు తీసుకోవాల్సి ఉంటుంది. ఢిల్లీలో బోర్డు చైర్మన్‌గా గంగారెడ్డి బాధ్యతలు స్వీకరించడం అనుమానాలకు తావిస్తున్నది. ప్రస్తుతం నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్‌కు పసుపు పంట రాక మొదలైంది. కనీస మద్దతు ధర అమలుకావడం లేదు. రూ.15 వేలు దక్కాల్సిన క్వింటా పసుపునకు రూ.9 వేల నుంచి రూ.11 వేలలోపే పలకడం గమనార్హం.

### బోర్డులు ఎక్కడో.. ఆఫీసులూ అక్కడే..

**కేంద్ర** ప్రభుత్వ ఆధీనంలోని అనేక రకాల బోర్డులు దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో ఉన్నాయి. సుగంధ ద్రవ్యాలకు సంబంధించి నేషనల్ స్పైసెస్ బోర్డును 1987లో కేరళ రాష్ట్రం కొచ్చిలో ఏర్పాటుచేశారు. ఈ బోర్డు ప్రధాన కార్యాలయం నేటికీ కొచ్చిలోనే కొనసాగుతున్నది. 1975 జనవరి 1న ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరులో పొగాకు బోర్డు నెలకొల్పారు. దీని ప్రధాన కార్యాలయం అక్కడే ఉన్నది. 1981 జనవరి 12న కేరళలోని కొచ్చిలో కోకోనట్ డెవలప్‌మెంట్ బోర్డును స్థాపించారు. కానీ, ఇప్పుడు వింతగా ఢిల్లీ కేంద్రంగా పసుపుబోర్డు ఆఫీస్‌ను ప్రారంభించి, అక్కడే చైర్మన్ బాధ్యతలు స్వీకరించడంపై రైతులు అనుమానాలు వ్యక్తంచేస్తున్నారు.

## వినోద్ పిటిషన్‌పై 'సుప్రీం' విచారణ వాయిదా

హైదరాబాద్, జనవరి 31 (నమస్తే తెలంగాణ): నూతన నేర న్యాయచట్టాలు బీఎన్‌ఎస్ (భారతీయ న్యాయ సంహిత), బీఎస్‌ఏ (భారతీయ సాక్ష్య అధినియమ్)ను సవాల్ చేస్తూ మాజీ ఎంపీ, బీఆర్‌ఎస్ నేత బోయినపల్లి వినోద్‌కుమార్ ఇటీవల రిట్ పిటిషన్ వేశారు. కాగా శుక్రవారం సుప్రీంకోర్టు ఈ రిట్ పిటిషన్‌పై విచారణను వాయిదా వేసింది. ఈ పిటిషన్‌ను ఇతర పిటిషన్లతో కలిపి ఫిబ్రవరి 5న విచారణ జరుపనున్నట్టు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్ కోటేశ్వర్‌సింగ్ ధర్మాసనం ప్రకటించింది.






Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.